# సత్యవాక్కు

# THE WORD OF TRUTH

## క్రైస్తవ మాసపత్రిక

JANUARY - 2017

సంవత్సర చందా రూ. 50/-

## టి.వి. ద్వారా క్రీస్తు సంఘముల సువార్త పరిచర్యలు

**సత్యవాణి**

| | | |
|---|---|---|
| ఆదివారం సాయంత్రం | : | 6.00 గంటలకు శుభవార్త |
| బుధవారం సాయంత్రం | : | 6.30 గంటలకు రక్షణ |
| గురువారం మధ్యాహ్నం | : | 2.30 గంటలకు రక్షణ |
| ప్రతిరోజు ఉదయం | : | 7.30 ని॥ కాంతి ఛానల్‌లో |
| ప్రతిరోజు మధ్యాహ్నం | : | 3.30 ని॥ కాంతి ఛానల్‌లో |
| ప్రసంగీకులు | : | జాషువా గూటం |
| | | లిక్కీ గూటం |
| | | రోనీ గూటం |

**Youtube లో satyavanichurchofchrist.com**

పై కార్యక్రమములను చూడండి

మీ బంధుమిత్రులను కూడా ప్రోత్సహించండి.

ఉచిత బైబలు కోర్సు కొరకు మాకు ఈరోజే వ్రాయండి


**SATYA VANI**

P.O.BOX. 80, KAKINADA

PIN : 533004. Ph : 0884 - 2363722

98489 98547, www.satyavanicoc.com

సత్యవాక్కు
THE WORD OF TRUTH
P.O. Box - 80, Kakinada, A.P. 533 001.
Ph : 0884-2363722 Cell : 98489 98547
Editor
JOSHUA GOOTAM
Pleading for Restoration of First Century Christianity
సంపుటి - 37 జనవరి - 2017 సంచిక -6

# యేసులో దైవ లక్షణములు

## (Attributes of God in Jesus)

యేసుప్రభువు తాను ఈ లోకములో యుంటుండగా తండ్రియైన దేవునిగూర్చి పదేపదే బోధించుచుండెను. ఆయన శిష్యులలో ఒకడైన ఫిలిప్పు దీనిని గమనించి, "ప్రభువా, తండ్రిని మాకు కనబరచుము, మాకంతే చాలునని ఆయనతో చెప్పగా యేసు, ఫిలిప్పు, నేనింతకాలము మీయొద్ద ఉండి నను నీవు నన్ను ఎరుగవా? నన్ను చూచిన వాడు తండ్రిని చూచి యున్నాడు. గనుక తండ్రిని మాకు కనపరచుమని యేల చెప్పుచున్నావు? తండ్రియందు నేనును నాయందు తండ్రియు ఉన్నామని నీవు నమ్ముటలేదా? నేను మీతో చెప్పుచున్న మాటలు నాయంతట నేనే చెప్పుటలేదు; తండ్రి నాయందు నివసించుచు తన క్రియలు చేయు చున్నాడని" అతనితో చెప్పెను (యోహాను 14:8-10).

యేసు దేవుని మహిమ యొక్క తేజస్సును, ఆయన తత్వము యొక్క మూర్తిమంతమునై యుండెను (హెబ్రీ 1:3). ఆయన దేవుని ఏకైక కుమారుడు. ఆయన దైవత్వమును, దైవలక్షణములను అన్నిటిని కలిగియుండెను. ఆయన ఇమ్మానుయేలు. అనగా ఆయన ఈ లోకమందుడినప్పుడు దేవుడు మనతో యుండెనని యర్థము (మత్తయి 1:23). క్రీస్తు ఈ లోకమందుండగా ఆయన శక్తితోను, పవిత్రతతోను, జ్ఞానముతోను, ప్రేమతోను కూడ దేవుడు మానవులతో ఎట్లుండెనో ఈ పాఠములో కొంత తెలిసి కొందుము.

**యేసుక్రీస్తు తన శక్తిలో దేవుని లక్షణములను కలిగి యుండెను.** దేవుడు నజరేయుడగు యేసుచేత మహత్కార్యములను, సూచకక్రియలను మనుష్యుల మధ్య చేయించి ఆయన దేవుని కుమారుడని నిరూపించెను (అపో.కా. 2:22). ఆయన చేసిన అద్భుతములు, ఆశ్చర్యములు అనేకములు. ఆయన గ్రుడ్డివారి నేత్రములను తెరచెను, చెవిటివారి చెవులను విప్పెను. మూగ వారిని మాట్లాడువారిగ చేసెను. కుష్ఠ రోగులను శుద్ధిచేసెను. అవిటి వారిని బాగుచేసెను, సముద్రము మీద నడిచెను, తుఫానును అణచెను, చనిపోయిన వారిని బ్రతికించెను, సమాధిని జయించెను. యేసు యొక్క మహిమను, శక్తిని, అధికారమును కన్నులార చూచినవారు దేవుని మహిమను, శక్తిని, అధికారమును చూచిరి.

**యేసు పవిత్రతలో దేవుని లక్షణములను కలిగియుండెను.** ఆయన ఈ లోకములో జీవించినను ఈ లోకమర్యాద చొప్పున ఆయన నడుచుకొనలేదు. మానవులవలె అన్ని విధములుగ ఆయన శోధింపబడినను శోధనకు ఆయన లొంగలేదు. అపవాది ఆయనను పడగొట్టుటకు శరీరాశ, నేత్రాశ, జీవపుడంబములను ప్రాముఖ్యముగ చూపించెను. అయినను దేవుని గ్రంథములోని లేఖనముల నుపయోగించి ఆయన అతనిని ఓడించెను (మత్తయి 4:1-11). ఆయన సమస్త విషయములలోను మనవలెనే శోధింప బడినను పాపములేనివాడుగా ఉండెను అని హెబ్రీ 4:15లో వ్రాయబడి యున్నది.

యేసు ఎంత పవిత్ర జీవితమును జీవించెనంటే ఆయన తన్ను విమర్శించుచున్న యూదులను చూచి "నాయందు పాపమున్నదని మీలో ఎవడు స్థాపించును?" అని వారిని ప్రశ్నించగలిగెను (యోహాను 8:46). నాటి నుండి నేటి వరకును యేసుక్రీస్తు జీవితములో పాపమును స్థాపించగలిగిన మానవుడెవడునులేడు. అందుకే "క్రీస్తు కూడ మీ కొరకు బాధపడి మీరు తన అడుగుజాడల యందు నడుచుకొనునట్లు మీకు మాదిరి యుంచిపోయెను. ఆయన పాపము చేయలేదు; ఆయన నోటను ఏ కపటమును కనబడలేదు. ఆయన దూషింపబడియు బదులు దూషింప లేదు; ఆయన శ్రమ పెట్టబడియు బెదిరింపక, న్యాయముగా తీర్పు తీర్చు దేవునికి తన్నుతాను అప్పగించుకొనెను" అని భక్తుడైన పేతురు వ్రాసెను (1 పేతురు 2:22, 23). కుమారుని యొక్క పరిశుద్ధతను చూచిన మానవులు తండ్రియైన దేవుని పరిశు

ద్ధతను చూడగలిగిరి.

**యేసు జ్ఞానములో దేవుని లక్షణములను కలిగియుండెను.** ఆయన మనుష్యుని అంతర్యము నెరిగినవాడు గనుక ఎవడును మనుష్యుని గూర్చి ఆయునకు సాక్ష్యమియ్య నక్కరలేదు. మానవునికి కావలసిన దేమిటో, ప్రాముఖ్యముగ కావలసిన దేమిటో ఆయన యెరుగును. అందువలన ఆయన నేర్పిన పాఠములు ఆ అవసరతను తీర్చగల్గెను. ఆయన బోధించినట్లు ఈ లోకమందున్న ఏ మానవుడు ఎన్నడు బోధించి యుండలేదు. మున్నెన్నడు యెవడు బోధించని రీతిగా మానవులు జీవించుట యెట్లో యేసు బోధించెను. వాక్యము కూడ నిందారహితమైన ఆయున జీవితమును మరింత ఘనముగా నిరూపించెను. యేసు పలికిన జ్ఞానవాక్యములను వినిన మానవుడు దేవుని జ్ఞానమును చెవులార వినగల్గిరి.

**ప్రేమలో యేసుక్రీస్తు దేవుని లక్షణమును కలిగి యుండెను.** ఆయన ప్రేమమూర్తి. పాపముతోను శాపముతోను నిండియున్న ఈ లోకములో ఆయన కరుణ యాత్రను కొనసాగించెను. నశించినదానిని వెదకి రక్షించుటకు ఆయన ఈలోకము నకు వచ్చెను. ఆయన ప్రేమను రెండు విధములుగా ఈ లోకములో కనుబరచెను. ఆయన మాటల ద్వారాను క్రియలద్వారాను దేవుని ప్రేమను మానవులకు కనుబరచెను. మానవులు దేవునిని, తోటి మానవులను కూడ ప్రేమించవలెనని ఆయన బోధించెను. ఒకసారి శాస్త్రులలో ఒకడు వచ్చి ఆజ్ఞలన్నిటిలో ప్రధానమైదేదని ఆయన నడిగెను. అందుకు యేసు ప్రధానమైనది ఏదనగా ఓ ఇశ్రాయేలూ వినుము : మన దేవుడైన ప్రభువు అద్వితీయ ప్రభువు. నీవు నీ పూర్ణ హృదయము తోను, నీ పూర్ణాత్మతోను, నీ పూర్ణ వివేకముతోను, నీ పూర్ణ బలముతోను నీ దేవుడైన ప్రభువును ప్రేమింప వలెనననునది ప్రధానమైన ఆజ్ఞ. రెండవది, నిన్నువలె నీ పొరుగు వానిని ప్రేమింపవలెనననునది రెండవ ఆజ్ఞ. వీటికంటె ముఖ్యమైన ఆజ్ఞ మరేమియు లేదని ఆతనితో చెప్పెను (మార్కు 12:28-31).

మరల, మనుష్యులు మీకు ఏమి చేయువలెనని మీరు కోరుదురో అలాగుననే మీరును వారికి చేయుడియని యేసు బోధించెను (మత్తయి 7:12). ఇది మానవులకు ఆయన యిచ్చిన బంగారు సూత్రము. యేసు యొక్క అపొస్తులులలో ఒకడు 1 కొరింథి 13వ అధ్యాయమును వ్రాయుచు ప్రేమ యొక్క నిజతత్త్వమును అందు వివరించెను.

యేసు తనక్రియల ద్వారా దేవుని ప్రేమను మానవులకు బయలు పరచెను. ఆయన ప్రజలకు మేలు చేయుచు సంచరించెను. పగిలిన హృదయములను ఆయన అతికించెను. ఒక గొప్ప మంచి సమరయునివలె మానవుల పాపపు గాయములపై శుద్ధిచేయు ద్రాక్షారసమును, గాయమును మాన్పు తైలమును ఆయన పోసి వారికి ఉపశమనమను గ్రహించెను. ఆయన తన జీవితమును అనేకుల కొరకు విమోచన క్రయ ధనముగా అర్పించెను (మార్కు 10:45). "మనుష్య కుమారుడు పరిచారము చేయించు కొనుటకు రాలేదుగాని పరిచారము చేయుటకును, అనేకులకు ప్రతిగా విమోచన క్రయ ధనముగా తన ప్రాణము ఇచ్చుటకును వచ్చెను". తన స్నేహితుల కొరకు తన ప్రాణము పెట్టువానికంటె ఎక్కువైన ప్రేమగల వాడెవడును లేడు" అని యేసు బోధించుటయే గాక తన ప్రాణమును మానవుల పాప పరిహారార్థమై సిలువ పై బలియిచ్చి నిరూపించెను (మార్కు 10:45; యోహాను 15:14). యేసు యొక్క ప్రేమను చూచిన మానవులు దేవుని ప్రేమను చూచిరి.

శక్తి, పవిత్రత, జ్ఞానము, ప్రేమలలో యేసును మించిన వాడెవడు లేడు. ఇవన్నియు దేవుని కుమారుని యొక్క లక్షణములు. యేసుక్రీస్తును గూర్చి మనము ఎంత ఎక్కువగ తెలిసికొనగలిగితే దేవుని గూర్చి అంత ఎక్కువగా తెలిసికొన గలము తండ్రియైన దేవుని గూర్చి మనము ఎక్కువ తెలిసికొన గోరుచున్న యెడల ఆయన కుమారుడైన క్రీస్తు జీవితమును ఎక్కువ తెలిసికొనవలసి యున్నది. గనుక బైబిలు అంతటిని ఆవరించుకొని యున్న ఆ దైవమూర్తిని చేరుటకు ఆయన పరిశుద్ధ గ్రంథమును మనము దినదినము చదువ వలసియున్నది.

యేసుక్రీస్తు యొక్క జీవిత చరిత్ర మనకు మత్తయి, మార్కు, లూకా, యోహాను సువార్తలలో దొరుకును. 'యేసు దేవుని కుమారుడైన క్రీస్తు అని మనము నమ్మునట్లును, నమ్మి ఆయన నామమందు జీవము పొందునట్లును అవి వ్రాయబడెను. క్రీస్తు నామమందు నీవు జీవము పొందగోరుచున్న యెడల క్రీస్తును నమ్ముకొనుము. ఆయన నామములోనికి పాపక్షమాపణ నిమిత్తము బాప్తిస్మము పొందుము. నమ్మి బాప్తిస్మము పొందిన వానిని ఆయన రక్షించును. నమ్మనొల్లని వానిని శిక్షించును.

# దీనిని గూర్చి నీవు ఆలోచించావా?

## ( Have you thought about this ? )

ప్రతి వ్యక్తి ఏదో ఒక మార్గములో నడుచుచున్నాడు. భౌతికంగా మనం జీవము నుండి మరణమునకు నడుచుచున్నాము. మనం ఎంచుకొనిన మార్గము ఆత్మీయ జీవమునకు లేదా ఆత్మీయ మరణమునకు గాని నడిపించ వచ్చును. అయితే అందరూ ఏదో ఒక గమ్యముకు చేరువగు చున్నామనునది వాస్తవము. గనుక మనము జ్ఞానయుక్త మైన నిర్ణయాలను గైకొనాలి. మనం చివరకు ఏ గమ్యానికి చేరుకుంటాము?

దీనిని గూర్చి ఆలోచించావా? మనం పయనించడానికి వేలకొలది మార్గములన్నాయని సహజంగా ప్రజలు తలస్తారు. అయితే మన నిర్ణయాన్ని బట్టి మన అంతిమ యాత్ర జీవములోనో లేక మరణములోనో ముగియును.

మనం పౌరాణిక దేవుండ్లను, ఆచారకర్మలను అనుసరిస్తామా? మూఢ నమ్మకములను, పూజా పద్ధతులను అనుసరించెదమా? పెక్కు మంది పయనించు మార్గము మనకు ఆకర్షణీయమా? మనతల్లి తండ్రుల మతమే మనదేనా? మానవ కల్పిత మతములను మనం అనుసరించెదమా? మనకు దగ్గరగా యున్న డినామినేషనే మనకు సంతృప్తికరముగా యున్నదా? ఏ మతము లేకుండా మనకు అంతా బాగానే యున్నదా?

దీనిని గూర్చి ఆలోచించావా? బైబిలు ఇట్లు చెప్పుచున్నది. "ఒకని యెదుట సరియైనదిగా కనబడు మార్గము కలదు అయితే తుదకు అది మరణమునకు త్రోవతీయును" (సామె 14:12). "యెహోవా, తమ మార్గము నేర్పరచుకొనుట నరుల వశములో లేదనియు మనుష్యులు తమ ప్రవర్తన యందు సన్మార్గమున ప్రవర్తించుట వారి వశములో లేదనియు నేనెరుగుదును" (యిర్మియా 10:23).

"యేసు నేనే మార్గమును, సత్యమును, జీవమును. నా ద్వారానే తప్ప యెవడును తండ్రి యొద్దకు రాడు" (యోహాను 14:6). "నేనే ద్వారమును, నా ద్వారా ఎవడైన లోపల

ప్రవేశించిన యెడల వాడు రక్షింపబడును" (యోహాను 10:9). యేసు దేనికి ద్వారము? "గొర్రెలు పోవుద్వారము నేనే... నేను గొర్రెలకు మంచి కాపరిని, నేను నా గొర్రెలను ఎరుగుదును, నా గొర్రెలు నన్ను ఎరుగును. మరియు గొర్రెల కొరకు నా ప్రాణము పెట్టుచున్నాను. ఈ దొడ్డివి కాని వేరేగొర్రెలును నాకు కలవు. వాటిని కూడ నేను తోడుకొని రావలెను అవి నా స్వరము వినును. అప్పుడు మంద ఒక్కటియు గొర్రెల కాపరి ఒక్కడును అగును" (యోహాను 10:7;14-16).

దీనిని గూర్చి ఆలోచించావా? యేసు యొక్క మాటలను బట్టి ఎన్ని సత్యములున్నాయి? ఒకే ఒక్కటి. ఎంతమంది రక్షకులున్నారు? ఒకే ఒక్కడు. ఎన్ని ద్వారములున్నాయి? ఒకే ఒక్కటి. ఎంతమంది గొర్రెలకాపరులు? ఒకే ఒక్కడు. గొర్రెలు దొడ్డిలు ఎన్ని? ఒకే ఒక్కటి. దీనిని గూర్చి ఆలోచించావా? దేవుని యొద్దకు అనేక మార్గము లున్నాయి. వాటిలో నీ కిష్టము వచ్చిన దానిని ఎంచుకోవచ్చని మానవులు చెభుతారు. గాని మన రక్షకుడైన యేసుక్రీస్తు మనుష్యులు సాధారణంగా పయనించు రెండే రెండు మార్గములున్నాయని చెప్పారు. "ఇరుకు ద్వారమున ప్రవేశించుడి; నాశనమునకు పోవు ద్వారము వెడల్పును ఆదారి విశాలమునై యున్నది, దాని ద్వారా ప్రవేశించువారు అనేకులు. జీవమునకు పోవు ద్వారము ఇరుకును ఆదారి సంకుచితమునై యున్నది. దాని కనుగొనువారు కొందరే" యని ఆయన పలికారు (మత్తయి 7:13-14). దీనిని గూర్చి ఆలోచించావా? క్రొత్త నిబంధనలో ఇరుకును సంకుచితమునై యున్న మార్గము ఒక ప్రత్యేకమైన ప్రజలైయున్నారు. పౌలు "ప్రధాన యాజకుని యొద్దకు వెళ్ళి యీ మార్గమందున్న పురుషులనైనను స్త్రీల నైనను బంధించి యెరూషలేమునకు తీసికొని వచ్చుటకు దమస్కులోని సమాజములవారికి పత్రికలిమ్మని అడిగెను" (అపొ.కా. 9:1-2). గనుక యీ మార్గమందున్న వారు నిజముగా, హింసింపబడుటకు ప్రత్యేకముగా గుర్తించదగిన ప్రజలు. "ఆ కాలమందు క్రీస్తు మార్గమును గూర్చి చాలా అల్లరి జరిగెను'' (అపొ.కా. 19:23). ఎఫెసులో పౌలు దేవుని రాజ్యమును

గూర్చి తర్కించుచు ఒప్పించుచుండెను గాని కొందరు యెప్పుకొనక జన సమూహము ఎదుట ఈ మార్గమును దూషించుచున్నందున వారిని విడిచి వెళ్లెను (అపో.కా. 19:8-9).

ప్రజలు దేవుని రాజ్యమును గూర్చిన వర్తమానమును నిరాకరించి నపుడు వారు యీ మార్గమును దూషించిరి. వారు చిరకాలము కనిపెట్టుచున్న రాజ్యమే యీ మార్గము. అదే క్రీస్తు సంఘము. 'నేను కూడ దేవుని యందు నిరీక్షణయుంచి వారు మత భేదమని పేరు పెట్టు యీ మార్గము చొప్పున నా పితరుల దేవుని సేవించుచున్నానని తమరి యెదుట ఒప్పుకొనుచున్నానని" పౌలు చెప్పెను (అ.పో.కా. 24:15). గనుక పౌలు ఈ మార్గమందున్న సభ్యుడు. అందున్న వారు దేవుని ప్రత్యేక పద్ధతిలో ఆరాధించేవారు. దీనిని గూర్చి నీవాలోచించావా? జీవమునకు పోవు మార్గము ఒకే ఒక్కటి యున్నదని, ఆ మార్గముతానేనని యేసు చెప్పెను. ఆ మార్గమును వెంబడించిన ఆదిమ క్రైస్తవులు ప్రజామోదము పొందిన వారు కారు. వారు బోధించిన బోధ ప్రజామోదము పొందలేదు. తమ ప్రభువు వారికేమి బోధించెనో దానినే వారు బోధించినందున వారు ద్వేషింప బడ్డారు, హింసింప బడ్డారు. అనేక మార్గములు లేవు, ఆమోదము పొందిన అనేక మతములు లేవు, అనేక సంఘములు లేవు, రక్షింపబడే అనేక మార్గములు లేవు, దేవుని ఆరాధించే అనేక పద్ధతులు లేవని వారు బోధించారు.

నేడు లోకంలో వేలకొలది సంఘాలు, వేలకొలది సిద్ధాంతాలు యున్న సందర్భములో ఏకత్వమును గూర్చి లేఖనాలలో యున్న వర్తమానము ప్రత్యేకముగా గుర్తింప దగినది, లేఖనములలో ఉన్నది ఉన్నట్టుగానే బోధించే క్రైస్తవులను నేటి మతశాఖల ప్రపంచము ద్వేషించు చున్నది. అయితే వారుగాని, ఇంకెవ్వరు గాని లేఖనములలోని వర్తమానమును మార్చజాలరు.

- బెట్టి ఛోట్

# దేవుని రాజ్యము

## (The Kingdom of God)

దేవుడు ఈ విశ్వాన్ని సృజింపక ముందునుండే రాజ్యమేలుచున్నారు. ఎవరిమాటల వలన భూమిపై వెలుగు కలిగెనో, ఎవరి జ్ఞానము వలన సూర్యుడు, చంద్రుడు, నక్షత్రములు, జంతువులు ఆకారము దాల్చెనో ఆయన పాలించుచున్నారు! ఆయన తనను గూర్చి బయలుపరుచుకొనుచు నేను సర్వశక్తుడనగు దేవుడను అని తన్ను గూర్చి ప్రకటించు కొనెను (నిర్గమ 6:3). భూమి మీద రాజులెవరు లేనప్పుడు ఆయన అన్నింటికంటె అందరికంటె పైగా నున్నవాడు. ఈ లోకములో ఉద్భవించిన ప్రతివానికి ఆయన రాజులకు రాజును, ప్రభువులకు ప్రభువై యున్నారు. ఇట్టి భావముతోనే దేవుడు ఎల్లప్పుడు ప్రభుత్వమును ఆధిపత్యమును కలిగి యున్నారు. మరియు తన సంకల్పమును బయలు పరచుచు ఒకానొక కాలమందు భూమి పై తన రాజ్యమును స్థాపింతునని ఆయన తెలియ జేసారు. దేవుడు వాగ్దానము చేసిన, తన కుమారుడు స్థాపించిన ఆ నిత్య రాజ్యమును గూర్చి మనం దృష్టియుంచాలి. ఆ రాజ్యము యొక్క ప్రాముఖ్యతను సూచిస్తూ యేసు "మొదట ఆయన రాజ్యమును నీతిని వెదకాలని" బోధించారు (మత్తయి 6:33).

**పాత నిబంధనలో దేవుని ఏలుబడి :**

సృష్టి జరిగించుటలో దేవుడు తన సర్వశక్తిని ఆధిపత్యమును తన సృష్టముపై ప్రదర్శించుటయే గాక, నోవహు కాలములో దేవుడు జల ప్రళయమును రప్పించినప్పుడు భూమి పై ఆయన ఆధిపత్యము నేరుగా ప్రత్యక్షమాయెను. నీతిమంతులు, అనీతిమంతులు, మానవజాతి అంతా ఆయన ఏలుబడిని అనుభవించిరి. ఆ గొప్ప విపత్తు ద్వారా దేవుడు లోకమును ఏలుచున్నట్లు మానవ జాతి అంతా తెలిసికొనాలని ఆయన కోరారు. "యెహోవా ప్రళయ జలముల మీద ఆసీనుడాయెను. యెహోవా నిత్యము రాజుగా ఆసీనుడైయున్నాడు" అని దావీదు పలికెను (కీర్తన 29:10). ఆయన అప్పుడు ఇప్పుడు కూడ రాజుగా ఆసీనుడైయున్నారు.

ఇశ్రాయేలీయులు ఐగుప్తు

నుండి నిష్క్రమించినప్పుడు దేవుడు ఆయన ఏలుబడి యొక్క మరియొక విశిష్టతను చూపించారు. మోషేకు సీనాయికొండ మీద ఆయన మనసులో యున్న దానిని బయలుపరిచారు. "మీరు నాకు యాజక రూపమైన రాజ్యముగాను పరిశుద్ధమైన జనముగాను ఉందురని" ఆయన ఇశ్రాయేలీయులకు తెలియ జేసారు (నిర్గమ 19:6). నలుబది సంవత్సరముల తరువాత తన జీవిత తుది సమయంలో సీనాయి కొండ మీద యేమి జరిగిందో అతడు ఇశ్రాయేలీయులకు తెలియ జేసాడు. మోషే వారిని ఆశీర్వదించాడు. "మోషే మనకు ధర్మశాస్త్రము విధించెను. అది యాకోబు స్వాస్థ్యము. జనులలో ముఖ్యులును ఇశ్రాయేలు గోత్రములును కూడగా అతడు యెషూరూనులో రాజు ఆయెను" (ద్వితీ 33:4,5). యెషూరూను అనగా ఇశ్రాయేలు (యెషయా 44:1,2). దేవుడు వారి రాజై యున్నారు. దేవుడు ఒక జనాంగమును తన కొరకు ప్రత్యేకించుకొన్నారు. ఆ జనాంగముతో సర్వశక్తుడగు దేవుడు ప్రత్యేక సంబంధము నేర్పరచు కొన్నారు. అయినను ఆయన మనసులో వేరొక రాజ్యముండెను. అది అన్ని విషయములలో ఇశ్రాయేలు రాజ్యముకు మించి యుండును.

ఇశ్రాయేలీయులు వాగ్దాన దేశములో ప్రవేశించినప్పుడు వారిని నడిపించుటకు న్యాయాధిపతులు ఎంచుకొనబడిరి, గాని దేవుడే వారి రాజైయుండెను. గిద్యోను దీనిని బాగుగా గ్రహించుకొనెను. రాజుగా తమను ఏలుమని ఇశ్రాయేలీయులు అతని కోరగా "అందుకు గిద్యోను నేను మిమ్మును ఏలను, నా కుమారుడును మిమ్మును ఏలరాదు, యెహోవా మిమ్మును ఏలునని చెప్పెను" (న్యాయా 8:23). వీరి రాజు దేవుడే. వారాయన రాజ్యము. అయినను అంతకంటె గొప్ప రాజ్యమును గూర్చి దేవుడు సంకల్పించి యుండెను.

కొన్ని సంవత్సరముల తరువాత యూదులు దేవుని సంకల్పమును నిరాకరించి, భూసంబంధ రాజ్యమును, రాజును, సింహాసనమును కోరుకొనిరి. వారి తలంపులను సమూయేలు ఖండించెను. అతడు దేవునికి తెలియ జేయగా యెహోవా సమూయేలునకు సెలవిచ్చిదేమనగా "వారు నిన్ను

విసర్జింప లేదుగాని తమ్మును ఏలకుండ నన్నే విసర్జించి యున్నారు" (1సమూ 8:7)

**దేవుని రాజ్యము రాబోవుచున్నదనే వాగ్దానము :**

పైన చెప్పబడిన భూరాజుల కాలములో దేవుడు తన ప్రవక్తల ద్వారా రాబోవు నిత్య రాజ్యమును గూర్చి తరుచు చెప్పుచు దాని వివరములు తెలియజేయుచుండెను. దావీదు మరణించిన తరువాత అతని సంతతిని హెచ్చించి రాజ్యమును అతనికి స్థిర పరచెదనని, "అతని రాజ్యసింహాసనమును నేను నిత్యముగా స్థిరపరచెదను" అని దేవుడు వాగ్దానము చేసెను (2సమూ 7:12-13). ఒకానొక దినమందు దావీదు రాజ్యము అంతమగును. గాని దేవుడొక నిత్యరాజ్యమును గూర్చి చెప్పారు. పెంతెకొస్తునాడు పేతురు తన ప్రసంగములో అది యేసుక్రీస్తు యొక్క పునరుత్థానమును గూర్చినదని చెప్పాడు (అపొ.కా. 2:29-31). ఆ నిత్య రాజ్యము రాబోవుచున్నది. క్రీస్తు దానికి రాజు.

రాబోవుచున్న రాజ్యమును గూర్చి యెషయా ప్రవచించాడు. కన్యక గర్భవతియై ఇమ్మానుయేలును కనునని అతడొక సమయాన్ని గూర్చి ప్రవచించాడు (యెషయా 7:14). ఆయన రాకను గూర్చి గాబ్రియేలు దూత తెలియజేస్తూ, "ఆయన గొప్పవాడై సర్వోన్నతుని కుమారుడన బడును; ప్రభువైన దేవుడు ఆయన తండ్రియైన దావీదు సింహాసనమును ఆయనకిచ్చును. ఆయన యాకోబు వంశస్థులను యుగయుగములు ఏలును; ఆయన రాజ్యము అంతము లేనిదైయుండునని చెప్పెను" (లూకా 1:31-33). సమాధానకర్తయగు అదిపతిని గూర్చి యెషయా చెప్పి నప్పుడు, "ఇది మొదలుకొని మితి లేకుండ దానికి వృద్ధియు క్షేమము కలుగునట్లు సర్వకాలము దావీదు సింహాసనమును రాజ్యమును నియమించును. న్యాయము వలనను, నీతివలనను రాజ్యమును స్థిరపరచుటకు అతడు సింహాసనాసీనుడై రాజ్య పరిపాలన చేయునని" పలికెను (యెషయా 9:6-7). మనుష్య కుమారుడు జన్మించినప్పుడు ఒక క్రొత్త రాజ్యము స్థాపించబడును, అది నిత్యము వుండునని జనులు తెలిసికోవాలని దేవుడు కాంక్షించారు.

రాబోవు రాజ్యమును గూర్చి యెషయా తన రెండవ అధ్యాయములో వివరించాడు. ఈ లోక జనాంగములను కొండలగా యెషయా వర్ణించాడు. మరియు అంత్య దినములలో దేవుడొక జనాంగమును స్థిరపరచును, అన్ని జనాంగములు దానిలో ప్రవేశించునని అతడు ప్రవచించాడు (యెషయా 2:2-4). అది జరిగినప్పుడు యెరూషలేములో నుండి ధర్మశాస్త్రము బయలు వెళ్ళును, జనాంగములన్నియు దానిలోనికి ప్రవేశించును. ఇశ్రాయేలు అప్పటికే ఒక జనాంగముగా యుండిరి. వారి కొకధర్మశాస్త్రముండెను. దాని కంటె గొప్పదానిని గూర్చి యెషయా ప్రవచించాడు. యెరూషలేము నుండి ధర్మశాస్త్రము బయలువెళ్లునను సంగతి బైబిలు అంతటిలో ఇక్కడ మాత్రమే చెప్పబడెను (యెషయా 2:3). ప్రభువైన యేసు ఆరోహణము కాకముందు యెరూషలేము మొదలుకొని లోకమంతయు పాపక్షమాపణ ప్రటింప బడునని తన శిష్యులకు చెప్పారు (లూకా 24:45-48). క్రొత్త పరిపాలనను, క్రొత్త నిబంధనను కలిపి యేసు చెప్పారు. యెషయా 2:1-4 యొక్క నెరవేర్పు అపొస్తులుల కార్యములలో మనకు కనబడ్తాది. యెరూషలేములో సంఘము ఆరంభ మాయెను. అక్కడ నుండియే సువార్త వ్యాపించెను.

దానియేలు గ్రంథములోని ప్రవచనములు మరింత గమనించ దగినవి. దేవుడు తన నిత్యరాజ్యమును గూర్చిన సంగతులను మరింతగా విస్తరించి తన ప్రవక్తల ద్వారా తెలియ జేసారు. క్రీస్తు పూర్వము ఆరువందల సంవత్సరములకు దేవుడు దానియేలు ద్వారా ఆయన నిత్యరాజ్యము ఎప్పుడు ఆరంభమగునో తెలియజేసారు. బబులోను చక్రవర్తియైన నెబుకద్నెజరు నాలుగు లోహములతో తయారు చేయబడిన బ్రహ్మాండమైన ప్రతిమనొక దానిని తన కలలోచూచెను. దేవుడు తన రాజ్యమును స్థాపించినప్పుడు ఆ ప్రతిమ తుత్తునియలుగా చేయబడి నట్లు అతడు చూచెను. దేవుని రాజ్యమైతే ఎన్నడు నాశనముకాదు, నరిగదా అది భూతలమంతా వ్యాపించెను (దానియేలు 2:1-44). ఈ లోకమును పాలించు నాలుగు సామ్రాజ్యములకు గురుతుగా ఆ నాలుగు లోహములు వుండెను (దానియేలు 2:39). ఆ ప్రతిమ యొక్క

మేలిమి బంగారు శిరస్సు బబులోను సామ్రాజ్యమును నెబుకద్నెజరును అని దానియేలు అతనికల యొక్క భావము తెలిపెను (దానియేలు 2:37). తదుపరి వెండి వేరొక సామ్రాజ్యమును, ఇత్తడి ఇంకొక సామ్రాజ్యమును సూచించెను. ఇవి ఒక దాని తరువాత ఇంకొకటి అధిపత్యమును చెలాయించెను. నాలుగవ భూసామ్రాజ్యము యినుముకు గురుతుగా యుండెను. ఆ రాజ్యము వచ్చిన తరువాత యేమి జరుగునో దానియేలు సూచించాడు. " ఆ రాజుల కాలములో పరలోక మందున్న దేవుడు ఒక రాజ్యము స్థాపించును. దానికెన్నటికిని నాశనము కలుగదు" (దానియేలు 2:44).

ఆ నాలుగు రాజ్యములు యేమిటి? మొదటి మూడు రాజ్యముల పేర్లను దానియేలు తెలియజేసాడు. మొదటిది బబులోను మాదీయపార సీకులవలన బబులోను నాశనము గావించబడింది (దానియేలు 5:18-31). మాదీయ పారసీక సామ్రాజ్యమును గ్రీకులు నాశనము గావించిరి. దేవుడు ఆ మొదటి మూడు సామ్రాజ్యముల పేర్లను ప్రత్యేకముగా తెలియజేసారు. గనుక వాటి విషయమై అనుమానంయేమిలేదు (దానియేలు 2:38; 8:20-21). గ్రీకుసామ్రాజ్యము తరువాత రోమాసామ్రాజ్యము యేలు బడిచేసెనని చరిత్రనెరిగిన ప్రతివాడు ఎరుగును. గనుక ఈ నాలుగవ భూసామ్రాజ్యకాలములో దేవుని నిత్య రాజ్యము స్థాపించబడునని దేవుడు తెలియజేసారు. రోమీయులు పాలించు కాలములో దేవుని రాజ్యము రావలసి యుండెను. యేసు ఈలోకమునకు వచ్చి రాజ్యమును గూర్చి బోధించి నప్పుడు రోమాసామ్రాజ్యము ఏలుబడి లో యుండెనని గమనించుము.

**మొదటి శతాబ్ధములో యున్నవారికి రాజ్యము వాగ్ధానము చేయబడెను :**

దేవుని వలన పంపబడిన అనేక వర్తమానికుల సాక్ష్యముతో క్రొత్త నిబంధన ప్రారంభమగుచున్నది. వారు దేవుడు వాగ్ధానము చేసిన నిత్య రాజ్యము స్థాపింపబడబోవుచున్నదని మొదటి శతాబ్ధములో యున్నవారికి వాగ్ధానము చేసిరి. దాని ఆవిష్కరణమును గూర్చి ప్రకటించిన వారిలో బాప్తిస్మమిచ్చు యోహాను మొదటివాడు. "మారుమనస్స

పొందుడి, దేవుని రాజ్యము ఆసన్నమై యున్నదని" అతడు ప్రకటించెను (మత్తయి 3:2). రాజ్యమును గూర్చి పాత నిబంధనలో దేవుడు చేసిన వాగ్దాన నెరవేర్పు కొరకు యూదులు ఆశతో ఎదురుచూచు చుండిరి. యోహాను మాటలను బట్టి అది సమీపముగానే యున్నదని వారికి విశదమాయెను .

రెండవ సాక్ష్యము ఇంకా గొప్పగా యున్నది. దాన్ని మనము అపార్థము చేసికొనలేము. గలిలయలో యేసు ప్రకటించుచు "కాలము సంపూర్ణమై యున్నది, దేవుని రాజ్యము సమీపించియున్నది" యని చెప్పు చుండెను (మార్కు 1 : 14-15 ). అయితే దేనికి కాలము సంపూర్ణమై యుండెను? దేవుని రాజ్యస్థాపనకు కాలము సంపూర్ణమై యుండెను.

దానియేలు ప్రవచించిన ప్రకారము రోమీయులు రాజ్యమేలు చుండిరి. రోమాసామ్రాజ్యము అంతము కాకముందు దేవుని రాజ్యము స్థాపించబడవలసి యుండెను. గనుక వాగ్దానము చేయబడిన రాజ్యము స్థాపించబడుటకుండుటకు అడ్డుపడేది యేదీలేదు.

వాగ్దానము చేయబడిన నిత్య రాజ్యము మొదటి శతాబ్దములోనే స్థాపించబడెననుటకు యేసు చెప్పిన ఈ మాటలు గమనించుము : "ఆయన – ఇక్కడ నిలిచియున్నవారిలో కొందరు దేవుని రాజ్యము బలముతో వచ్చుట చూచువరకు మరణము రుచిచూడరని నిశ్చయముగా మీతోచెప్పుచున్నానని" యేసు పలికెను (మార్కు 9:1). యిది జరిగిందా? లేదా? మొదటి శతాబ్దపు కాలములో బ్రదికియున్నవారి జీవిత కాలములోనే ఆ రాజ్యస్థాపన జరిగిందా, లేదా? ఆయన రాజ్యము రాకముందు దానిని గూర్చి దేవుడు పాతనిబంధన ప్రవక్తల ద్వారా తెలియజేసారు. అది వచ్చే కాలమును గూర్చి కూడ ఆయన వారికి తెలియ జేసారు. అది వారి జీవితకాలములోనే జరుగునని యేసు చెప్పారు.

యేసు 12 మంది అపొస్తులులను ఏర్పరచుకొని వారిని ఇశ్రాయేలీయుల యొద్దకు పంపుచు, "పరలోక రాజ్యము సమీపించియున్నదని చెప్పుడి" యని ఆజ్ఞాపించెను (మత్తయి 10:7). తదుపరి డెబ్బది మంది శిష్యులను పంపుచు, "దేవుని రాజ్యము మీ

యొద్దకు వచ్చియున్నదని చెప్పుడి" యనెను (లూకా 10:9).

ఈ వాస్తవములను గమనించుము. దేవుడు ఎల్లవేళలా పాలించెను. ఆయన ఇశ్రాయేలును పాలించెను. అయినను రాబోవు నిత్య రాజ్యము గూర్చి వారికి పదేపదే తెలియజేస్తుయుండెను. అది వచ్చు సమయమును ఆయన వారికి ప్రకటించెను. రాజ్యము స్థాపింపబడక ముందు ఆయన 84 మంది వర్తమానికుల ద్వారా సాక్ష్య మిప్పించెను. వారిలో యేసుక్రీస్తు గాక, బాప్తిస్మమిచ్చు యోహాను కూడ యుండెను. ఇప్పుడు మిగిలియున్న ప్రశ్న అంతా ఆ రాజ్యమును గుర్తించుటే.

**రాజ్యమనగా యేమిటి ?**

మొదటి శతాబ్ధములో దేవుని రాజ్యము స్థాపించబడలేదనువారు దేవుని వాక్యముతో తమ భావములను ఎట్లు సమన్వయిస్తారు? యేసు వచ్చినప్పుడు దేవుడు రాజ్యమును స్థాపించాలనుకొన్నారు గాని, యూదులు యేసును రాజుగా స్వీకరించనందున దానికి బదులు ఆయన సంఘమును స్థాపించారు అని యందురు. మరియు దేవుడు తన సంకల్పమును మార్చుకొని క్రీస్తు రెండవరాకడలో దానిని స్థాపించునని వారు చెబుతారు. దేవుని నిత్యరాజ్యము, క్రీస్తు సంఘము ఒక్కటేయను ప్రాముఖ్య సత్యమును వారు విస్మరింతురు.

సంఘము రాజ్యము ఒక్కటేయను నాలుగు వాస్తవములను మనము గమనించవచ్చును. యేసు రాజ్యమునకు సంఘమునకు యేమీ వ్యత్యాసమున్నట్లుగా బోధించలేదు (మత్తయి 16:13-19). క్రీస్తు తన సంఘమును కట్టుదునని, రాజ్యము యొక్క తాళములను పేతురుకిత్తునని వాగ్ధానము చేసెను. ఆయన ఆరెంటికి వ్యత్యాసము చూపలేదు. మేడగదిలో ఆయన రాజ్యములో ప్రభురాత్రి భోజనముండునని ఆయన వాగ్ధానము చేసెను (మత్తయి 26:29). గాని ప్రభురాత్రి భోజనమును సంఘములో యుంచెను (1కొరింథీ 11:20-24). గనుక సంఘమే రాజ్యమైయున్నది. మరియు క్రీస్తు మరల వచ్చునప్పుడు ప్రభురాత్రి భోజనము అంతమగును. ఆయన తన రాజ్యమును తండ్రికి

అప్పగించును (1 కొరింథీ 11:24-26).

యేసు రాజ్యమును వాగ్ధానము చేసారు గనుక అది యేమాయెను? ఆయన రాజ్యమైన సంఘమాయెను! గనుక సంఘమే దేవుని రాజ్యమై యున్నది. మరల పెంతెకొస్తుకు ముందున్న లేఖములన్నియు రాజ్యము కొరకు ఎదురుచూచుచుండెను. పెంతెకొస్తు తరువాత సంఘము / రాజ్యము స్థాపించబడియున్నట్లు అవి సూచించున్నవి.

కొలస్సయులో క్రీస్తుసంఘములో యున్నవారు అంధకార సంబంధమైన అధికారములో నుండి విడుదల చేయబడి తాను ప్రేమించిన తన కుమారుని యొక్క రాజ్యనివాసులుగా చేయబడితిరని హెచ్చరింపబడిరి (కొలస్స 1:13). గనుక ఈ మొదటి శతాబ్దపు క్రైస్తవులకు రాజ్యము భవిష్యత్యులో లేదు. వారు దానిలోనే యుండిరి! యోహాను ఆసియాలోని ఏడు సంఘములకు వ్రాయుచు అతడు రాజ్యములో వారితో పాలిభాగస్థుడనని చెప్పెను (ప్రకటన 1:9). హెబ్రీ క్రైస్తవులు రాజ్యము పొందియుండిరని హెచ్చరింపబడిరి (హెబ్రీ 12:28). అది భవిష్యత్తులో కాదు. ఇప్పుడే వారు అందులో యున్నారు. రాజ్యమును స్థాపింతునని దేవుడు వాగ్ధానము చేసారు. సంఘములో యున్నవారు ఆయన రాజ్యపౌరులు. దేవుని మనస్సులో యున్న రాజ్యమే క్రీస్తుసంఘము!

**ముగింపు :**

ఆ రాజ్యమునకేమి జరుగును? యేసు మరల వచ్చినప్పుడాయన తన రాజ్యమును తండ్రికి అప్పగించును, అప్పుడు అంతము వచ్చును (1కొరింథీ 15:24). యేసు ఇప్పుడు రాజులకు రాజుగా పాలించుచున్నారు. కడవరి శత్రువగు మరణము నశింపచేయబడు వరకు ఆయన పాలించుచునే యుండును (1 కొరింథీ 15:26). నిత్యత్వము నుండి దేవుడొక సంకల్పము కలిగియుండెను. అది ఆయన రాజ్యపౌరులై యున్నారని తెలిసికొనుట ఎంత ఆశీర్వాదమో! ఆయన నిత్యసంకల్పములో మనము భాగస్థులమై యున్నాము !!

-డేన్ జెన్‌కిన్స్

# సంఘములో స్త్రీ పాత్ర

ప్రభువైన దేవుడు సృష్టిలోని ప్రతి దానిని ఐదు దినాలలో సృజించారు. ఆరవ దిమున ఆయన స్త్రీని, పురుషుని ఆయన పోలికలో సృజించారు. దేవుడు ప్రతిదానిని సృజించి అది మంచిదైనట్టు గా చెప్పారు. అయితే నరుడు ఒంటరిగా ఉండుట మంచిది కాదు, వానికి సాటియైన సహాయమును వాని కొరకు చేయుదుననుకొనెను. దేవుడైన యెహోవా ప్రతి భూజంతువును, ప్రతి ఆకాశపక్షిని నేల నుండి నిర్మించి, ఆదాము వాటికి ఏపేరు పెట్టునో చూచుటకు వాటిని అతని యొద్దకు రప్పించెను. జీవముగల ప్రతిదానికిని ఆదాము ఏ పేరుపెట్టెనో ఆ పేరు దానికి కలిగెను. అప్పుడు ఆదాము సమస్త పశువులకును, ఆకాశపక్షులకు, సమస్త భూజంతువులకును పేరులు పెట్టెను. అయినను ఆదామునకు సాటియైన సహాయము అతనికి లేకపోయెను. అప్పుడు దేవుడైన యెహోవా ఆదామునకు గాఢనిద్ర కలుగజేసి అతడు నిద్రించినపుడు అతని ప్రక్కటెముకలలో ఒకదానిని తీసి ఆ చోటును మాంసముతో పూడ్చి వేసెను. తరువాత దేవుడైన యెహోవా తాను ఆదాము నుండి తీసిన ప్రక్కటెముకను స్త్రీనిగా నిర్మించి ఆమెను ఆదాము నొద్దకు తీసికొని వచ్చెను" (ఆది.కా. 2:18-22).

ఒక ప్రత్యేకమైన ఉద్దేశ్యముతో ప్రత్యేకమైన అవసరంతో స్త్రీ నిర్మింప బడింది. స్త్రీ - భార్యగా, తల్లిగా, కుమార్తెగా, సోదరిగా ఇంకా అలా ఎన్నోపాత్రలు కలిగిఉంది. స్త్రీ తన బాధ్యతలను సరియైన రీతిలో నిర్వర్తించినపుడు ఆమె కుటుంబము దీవింపబడుతుంది. అలాకానిచో ఆ కుటుంబము ఇబ్బందులపాలవుతుంది. కుటుంబానికి పెద్ద భర్తే అయినప్పటికీ స్త్రీ లేకుండా ఆ కుటుంబం పరిపూర్ణం కాదు. పురుషులు ఇంటిలోను, సంఘంలోను నాయకులు గాని స్త్రీలు మాత్రం ఇంటిలోను సంఘంలోను బాధ్యతలు కలిగి ఉన్నారు. తన కుటుంబం యోగక్షేమాలు చూచుకొనే ఒక అద్భుతమైన సహాయకురాలు తల్లి, పురుషునికి అద్భుతమైన సహచరి స్త్రీ.

దేవుడు భూమిపై స్థాపించిన మొదటి వ్యవస్థ కుటుంబము. ఆయన సృష్టించిన ప్రతిదానికి కొన్ని నియమాలు ఏర్పరిచారు. ఆ

నియమాలు అనుసరించినంతకాలం మనం శాంతి, సంతోషాలతో కూడిన జీవనం సాగిస్తాం. దేవుడు మానవుని తన పోలికలో సృజించారు. "పురుషుడైతే దేవుని యొక్క పోలికయు మహిమయునై యున్నాడు" (1కొరింథి 11:7) "నీ ముఖము చెమటకార్చి ఆహారము తిందువు" (ఆది.కా3:19, 1తిమోతి 5:8). దేవుడు ఇప్పటి వరకు ఈ చట్టాన్ని మార్చలేదు. అవ్వ నాయకత్వం కోసం నిర్ణయం తీసికొని సాతాను యొక్క ఉచ్చులో పడింది. దేవుడు మొదటిగా పురుషుని సృజించి ఆ తరువాత అతనికి సహకారిగా స్త్రీని సృజించారు (1కొరింథి11:8). స్త్రీని బలహీనఘంటము అని పేతురు అభివర్ణిస్తున్నాడు (1పేతురు 3:7). ఆమె ఉద్రేకపరంగా బలహీనురాలు అనగా దయ, ప్రేమతో నిండినది. గనుక త్వరగా తేలికగా ఇతరుల వల్ల ప్రభావితం కాగలదు. భౌతికంగా చూస్తే పురుషుని కంటె ఆమె బలహీనురాలు. ఒక తీగవలె ఇతరులపై ఆధారపడు లాగున స్త్రీలు సృజింపబడ్డారు. బాల్యంలో తండ్రి, యౌవనంలో భర్త, వృద్ధాప్యంలో బిడ్డలు ఆమెను గూర్చి జాగ్రత్త తీసుకుంటారు. యౌవన స్త్రీలకు బోధించవలసిందిగా పౌలు వృద్ధస్త్రీలను ప్రోత్సహిస్తున్నాడు.

"వృద్ధ స్త్రీలు ప్రవర్తన యందు భయభక్తులు గలవారై యుండవలె ననియు దేవుని వాక్యము దూషింపబడ కుండునట్లు, యౌవన స్త్రీలు తమ భర్తలకు లోబడి యుండి తమ భర్తలను శిశువులను ప్రేమించు వారును స్వస్థబుద్ధి గలవారును పవిత్రులును ఇంట నుండి పని చేసికొను వారును మంచి వారునై యుండవలెననియు బోధించుము (తీతు 2:3-5).

పురుషుడు కుటుంబానికి శిరస్సు నాయకుడు. స్త్రీ లారా! ప్రభువునకు వలె మీ సొంత పురుషులకు లోబడి యుండుడి (ఎఫెసి 5:22, కొలస్సి 3:18, 1పేతురు 3:1). భర్తలు తమ భార్యలను ప్రేమించినపుడు, భార్యలు తమ భర్తలకు లోబడియుండినపుడు ఆ ఇల్లు ఆనందంతో ఆశీర్వాదంతో నిండినదౌతుంది (కొలస్సీ 3:19). "స్త్రీలు మౌనముగా ఉండి సంపూర్ణ విధేయతతో నేర్చుకొనవలెను. స్త్రీ మౌనముగా ఉండవలసినదే గాని ఉపదేశించుటకైనను పురుషుని మీద అధికారము చేయుటకైనను ఆమెకు సెలవియ్యను. మొదట ఆదాము తరువాత అవ్వయును నిర్మింపబడిరి

కారా? మరియు ఆదాము మోసపరచ బడలేదు గాని స్త్రీ అపరాధములో పడెను'' (1తిమో 2:11-14). మొదటిగా పురుషుడు సృజింపబడినను అతడు మోసపరచబడలేదు. స్త్రీ మొదటిగా మోసగింపబడి మొదటిగా దేవుని ఆజ్ఞకు అవిధేయురాలైంది.

పరిశుద్ధ గ్రంథం స్త్రీకి ఎట్టి ప్రాధాన్యత నిస్తుంది? పురుషుడు దేవుని పోలికలో సృజింపబడ్డాడు. పురుషుడు మోసగింపబడలేదు. పురుషునికి ప్రథమస్థానం ఇయ్యబడింది. స్త్రీలు అలాకాదు ఆమె బాగా మంచిది లేదా చాలా చెడ్డది అయిఉంటే తప్ప సాధారణంగా స్త్రీల పేర్లు బైబిలులో చెప్పబడలేదు. స్త్రీల యొక్క సంఖ్యగాని వారిపేర్లు గాని జనన పట్టికలో చెప్పబడలేదు. బైబిలులోని ఏ పుస్తకమునూ స్త్రీలు వ్రాయలేదు.

యాకోబునకు పంట్రెండుగురు కుమారులున్నారు. వారి పంట్రెండు గోత్రాలను దేవుడు దీవించారు గాని యాకోబు కుమార్తె దీనా పేరుతో ఒక గోత్రం కూడా లేదు. దేవాలయము లోని సేవలో ఆడయాజకురాలు ఉండాలని దేవుడు ఎక్కడా చెప్పలేదు. న్యాయాధి పతులు గ్రంథం 4వ అ॥లో మనము దెబోరా అనే ఒక ప్రవక్త్రి గురించి చదువుతాము. అప్పటిలో ఇశ్రాయేలీయులలో సమర్థులైన పురుషులు లేరు. గనుకనే దెబోరా, యెషయా ప్రవక్త భార్య లాంటివారున్నారు (యెషయా : 8:3). తన తపున ప్రజలతో మాట్లాడుటకు గాను పురుషులనే నియమించారు గాని యూదాలోగాని ఇశ్రాయేలులోగాని ఏలికలుగా రాణులు లేరు.

యేసు ప్రభువు యొక్క పంట్రెండుగురు శిష్యులు పురుషులే స్త్రీలు లేరు. సంఘ కార్యక్రమాలలో తమకు సహాయపడుటకు గాను అపొస్తులులు ఏడుగురు పెద్దలను ఏర్పరచుకున్నారు. వారిలో స్త్రీలు ఎవరులేరు (అపొ.కా. 6:5). పెద్దల యొక్క అధ్యక్షుల యొక్క అర్హతలను గూర్చి పౌలు ఇలా వ్రాస్తున్నాడు "ఎవడైనను అధ్యక్షపదవినాశించిన యెడల అట్టివాడు దొడ్డపనిని అపేక్షించుచున్నాడనుమాట నమ్మ దగినది. అధ్యక్షుడగు వాడు నిందా రహితుడు, ఏకపత్ని పురుషుడును తన ఇంటివారిని బాగుగా ఏలువాడునై యుండవలెను (1తిమో3:1-3, తీతు 1:5-9). పెద్దలుగా, అధ్యక్షులుగా

ఉండవలసిన స్త్రీల యొక్క అర్హతలు పరిశుద్ధ గ్రంథంలో ఎక్కడా చూడము. తనతోపాటు మంచి పరిచర్య చేసిన స్త్రీలయిన కెంక్రేయలోని ఫీబె అను సహోదరిని గురించి, ఫిలిప్పీ సంఘంలో యువోదియ, సుంటుకె అను వారిని గురించి పౌలుప్రాసాడు (రోమా16:1, ఫిలిప్పీ 4:2-3).

లూకా 8వ అధ్యాయంలో కొందరు స్త్రీల పేర్లను వ్రాసాడు. ఏడు దయ్యాల నుండి విడుదల పొందిన మగ్దలేనె మరియ, హేరోదు గృహ నిర్వహకుడకు కూజా భార్యఅయిన యొహన్నా, సూసన్నా ఇంకా అనేక మంది స్త్రీలు తమకు కలిగిన దానితో సేవచేసిన వారిపేర్లు. ఈ స్త్రీలు యేసు ప్రభువును శిలువ పునరుద్ధానముల వరకు వెంబడించారు (మత్తయి 27:55, 28:1, మార్కు 16:1). క్రీస్తు శరీరము క్షేమాభివృద్ధి చెందుటకును, పరిచర్య ధర్మము జరుగుటకును, ఆయన కొందరిని అపొస్తులులను గాను, కొందరిని ప్రవక్తలను గాను, కొందరిని సువార్తికులను గాను, కొందరిని కాపరులను గాను, ఉపదేశకులను గాను నియమించెను (ఎఫెసీ 4:11).

గనుక సంఘములో స్త్రీ పాత్ర ఏమిటి? "స్త్రీలు సంఘములో మౌనముగా ఉండవలెను, వారు లోబడి ఉండవలసినదేగాని మాట లాడుటకు వారికి సెలవులేదు. ఈలాగు ధర్మశాస్త్రము చెప్పుచున్నది. వారు ఏమైనా నేర్చుకొన గోరిన యెడల ఇంట తమ తమ భర్తలను అడుగవలెను. సంఘములో స్త్రీ మాటలాడుట అవమానము (1కొరింథి 14:34,35). యోహాను బాప్తిస్మము మాత్రమే ఎరిగి అపొల్లో సమాజమందిరంలో మాట్లాడడం అకుల, ప్రిస్కిల్ల విన్నారు. వారు అతని చేర్చుకుని దేవుని మార్గము మరిపూర్తిగా అతనికి విశదపరిచిరి. ఇది వారు బాహాటంగా చేయలేదు (అపొ.కా. 18:25,26). క్రైస్తవురాలుగా ఆమె దేవునిని క్రమంగా ఆరాధించాలి. స్త్రీలు దేవుని కుటుంబములోని భాగము, ఆయన శరీరములోని సభ్యులు. ఆత్మతోను, సత్యముతోను ఆమె దేవుని ఆరాధించవలెను. దేవుని సేవకొరకు ద్రవ్యాన్ని ఇవ్వాలి (లూకా 8:1-3; నిర్గ 35:25-26). తమ పిల్లలకు ఇతర యౌవనులకు బోధించాలి (తీతు 2:3-5). సువార్త విస్తరణలో కష్టపడు వారికి స్త్రీలు సహాయపడాలి. ఫీబె,

యవోదియ, సుంటుకెల వలె.

ఆది సంఘములోని స్త్రీలు మనకు మాదిరి. పేతురు కొరకు ప్రార్ధించు లాగున మార్కు తల్లియైన మరియ తన గృహాన్ని పరిశుద్ధులకు తెరచింది (లూకా 12:12). గృహయజమానురాలు తన ఇంటిలో స్థలాన్ని ప్రార్ధన కొరకు, కూడికల కొరకు ఇవ్వాలి. యొప్పేలోని ఒక క్రైస్తవ స్త్రీ తబిత లేదా దొర్కా అనేక సత్కార్యాలు, ధర్మకార్యాలు చేసింది. సంఘములోని బీదలైన ఇతర స్త్రీలకు ఆమె సహాయం చేసింది. బీద విధవరాండ్ర కోసం వస్త్రాలు, అంగీలు కుట్టింది (అపో.కా.9: 36-43). ఈ విధంగా అనేక రీతులు స్త్రీలు ఇతరులకు సహాయపడాలి. అపో.కా16:11 -15 వరకు ఉన్న భాగంలో మనము లూదియ అను ఒక సహోదరి మార్పుచెందడం గురించి చూస్తాం. ఆమె, ఆమె ఇంటివారు బాప్తిస్మము పొందిన వెంటనే ఆమె దైవసేవకుల వర్గానికి ఆతిధ్యమిచ్చింది. తద్వారా దేవుని వాక్యం ఆసియా అంతట వ్యాప్తిచెందింది. ఆతిధ్యము చేయ మరువకుడి, దానివలన కొందరు ఎరుగకయే దేవదూతలకు ఆతిధ్యము చేసిరి (హెబ్రీ 13:2). సణుగుకొన కుండా ఒకని కొకడు ఆతిధ్యం చేయుడి (1పేతురు 4:9, రోమా 12:13). ప్రిస్కిల్లా వలె వాక్యము ఎరుగని వారికి స్త్రీలు వాక్యాన్ని బోధించవచ్చు.

మంచిదేవుడు స్త్రీలకు పురుషులకు వివిధపాత్రలు కేటాయించారు. గాని దేవుని ఆజ్ఞలు మాత్రము అందరికి ఒక్కటే. "క్రీస్తు లోనికి బాప్తిస్మము పొందిన వారందరు క్రీస్తును ధరించుకొని యున్నారు. ఇందులో యూదుడని, గ్రీసుదేశస్థుడని లేదు, దాసుడని స్వతంత్రుడని లేదు, పురుషుడని స్త్రీ అని లేదు యేసుక్రీస్తునందు మీరందరును ఏకముగా ఉన్నారు. మీరు క్రీస్తు సంబంధులైతే ఆ వక్షమందు అబ్రహాము యొక్క సంతానమైయుండి వాగ్దాన ప్రకారము వారసులైయున్నారు" (గలతీ 3:27-29).

మనకు నిర్ణయించబడిన పాత్రలో నిలిచియుండి ఆయన ఆజ్ఞలకు విధేయులమగుచు ఆశీర్వదింపబడిన వారంగా ఆనందముతో ఇపుడును ఎల్లపుడును ఉందుము గాక.

-కబితాగూటం

# సంక్షిప్త వార్తలు

2016వ సంవత్సరము డిశంబరు 5వ తేదీ సాయంకాలము 7:46 ని॥లకు జాషువాగూటం గారి కనిష్ట కుమారుడు రాబిన్ – రేచల్ దంపతులకు దేవుడు ఒక కుమారుని అనుగ్రహించారు. తల్లిబిడ్డయు క్షేమముగా యున్నారు. సెప్టెంబరునెలలో రిక్కీగూటం దంపతులకు ఒక కుమార్తె జన్మించెననునది చదువరులకు విదితమే.

2016 డిశంబరు మొదటివారంలో అమెరికా నుండి సోదరులు రిక్‌జాన్సన్ గారు కాకినాడ చేరుకొని జనవరి 2017 మొదటితేదీ వరకు స్థానిక సంఘముతోను, రిక్కీగారితోను కలసి పలుగ్రామములలో సువార్త పరిచర్య చేసిరి.

2016 డిశంబరు 15,16 తేదీలలో రిక్కీగూటం గారు, రిక్‌జాన్సన్ గారు నల్గొండ జిల్లాలో పర్యటించి పలుగ్రామములు దర్శించి వాక్యపరిచర్య చేసిరి. ముఖ్యముగా మోత్కూరు మండలంలో మోత్కూరు, అడ్డగూడూరు, చిన్నపరిటాల గ్రామములలో ప్రత్యేక బైబిలు తరగతులు నిర్వహించి స్థానిక సంఘములను, యువకులను ఆత్మీయముగా హెచ్చరించిరి. నల్గొండ జిల్లాలోను, పరిసరప్రాంతములలోను మరియు హైదరాబాద్ పట్టణములోను కూడ సోదరులు గూటం (బుచ్చుమల్లు) ఐజక్ గారు క్రీస్తు కొరకు మంచి పనిచేయుచున్నారు.

2016 డిశంబరు 20వ తేదీ మంగళవారం నాడు కాకినాడ క్రీస్తు సంఘ సత్యవాణి ఆవరణలో సువార్తికుల సదస్సు ఘనముగా జరిగెను. పలు జిల్లాల నుండి, గ్రామముల నుండి వచ్చిన సువార్తికులు సంవత్సరాంతకాలమున కూడుకొని ఒకరినొకరు అభినందించుకొనిరి. సోదరులు రిక్‌జాన్సన్, రిక్కీగూటం, యన్. నతానియేలు మరియు తదితర్లు వాక్యపరిచర్యచేసిరి. హాజరైన వారందరకీ మంచి భోజనము ఏర్పాటుచేయబడెను.

2016 డిశంబరు ఆఖరివారంలో రిక్కీ గారు, జాన్సన్ గార్లు నర్సీపట్నం మండలంలో పలు గ్రామములు, సంఘముల దర్శించి వాక్యపరిచర్యచేసిరి. వారు కరీంనగర్ జిల్లాలోను పర్యటించి కరీంనగర్‌లోను, ఎలుగంటి గ్రామంలోను

పరిచర్యచేసిరి. సోదరులు మచ్చాదేవిడ్ మరియు పసులు దానియేలు గార్లు కరీంనగర్ జిల్లాలో సహకరించిరి.

2016 డిశంబరు 24వ తేదీ నాడు కాకినాడ సమీపములోయున్న వెంకటకృష్ణరాయపురంలో సోదరులు బొండపాటి రాజారత్నం, రవీంద్రనాథ్ గార్ల ఆధ్వర్యంలో లాకులపేటలో నిర్మించబడిన క్రీస్తుసంఘ ఆలయమును సోదరులు జాషువాగూటం గారు రిబ్బను కత్తిరించి సంఘసేవార్థమై దానిని ప్రతిష్టించిరి. హాజరైన వందలాది ప్రజలకు స్థానిక సంఘము మంచి విందును ఏర్పాటుచేసిరి. రాజారత్నం గారిని, రవీంద్రనాథ్ గారిని గ్రామపెద్దలు, పంచాయితీ ప్రశిడెంట్లు, శ్రేయోభిలాషులు అభినందించిరి.

2016 నుండి 2017 లోనికి సత్యవాణి క్రీస్తుసంఘము 500లకు పైగా కూడుకొని 31వ తేదీ అర్ధరాత్రి వరకు ప్రభువు సన్నిధిలో గడుపుచు నూతన సంవత్సరములోనికి ప్రవేశించిరి. ఈ నూతన సంవత్సరములో దేవుడు తనవారినందరినీ ఆయురారోగ్యములతో దీవించునుగాక!

RNI Regd. No. 69973/98
Postal Regd. No. AP/KD-02/2015-17
Date of Posting: 14 & 15th every month

From :
**SATYAVAKKU**
P.O. Box 80, Kakinada - 533 001



Edited & Published by Joshua Gootam Printed by him at Satya Vani Publication, Sambamurthy St., Kakinada - 533 004.